▪ దొంగ ప్రేమకథ

కల్వన్

ఓటీటీ హిట్

డిస్నీ ప్లస్ హాట్‌స్టార్: మే 14
తారాగణం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఇవానా, భారతీరాజా తదితరులు
దర్శకత్వం: పీవీ శంకర్

తమిళ సినిమాలు తెలుగులో విడుదల కావడం సాధారణమే. ఇలా విడుదలైన సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించాయి కూడా. కెరీర్‌లో మ్యూజిక్ డైరెక్టర్‌గా, సింగర్‌గా పేరు సంపాదించుకున్న జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా చేసిన మరో సినిమా 'కల్వన్'. తమిళంలో తెరకెక్కి విజయం సాధించిన ఈ సినిమాను తెలుగులోకి డబ్బింగ్ చేయగా, ప్రముఖ ఓటీటీ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్నది.

కథ: కెంబన్ అలియాస్ కెంబరాజు (జీవీ ప్రకాశ్‌కుమార్) స్నేహితుడు సూరి (దీనా)తో కలిసి అడవి పక్కనే ఉన్న చిన్న పల్లెటూరిలో జీవిస్తుంటాడు. అనాథలైన వీరిద్దరూ ఊళ్లో చిన్న చిన్న దొంగతనాలు చేస్తుంటారు. ఒక రోజు తన ఇంట్లో దొంగతనానికి వచ్చిన ఆ ఇద్దరిని ఇంటి యజమానురాలు బాలమణి (ఇవానా)తెలివిగా పోలీసులకు పట్టిస్తుంది. అప్పుడే బాలమణితో ప్రేమలో పడతాడు కెంబన్. బాలమణి మెప్పు పొందడం కోసం అనాథాశ్రమంలో ఉండే ఒక వృద్ధుడి (భారతీరాజా)ని దత్తత తీసుకుంటాడు. అది నిజమని నమ్మిన బాలమణి కెంబన్‌తో ప్రేమలో పడుతుంది. ఇక, కెంబన్ నివసించే గ్రామంలో తరచూ ఏనుగులు, పులులు దాడి చేస్తాయి. ప్రతిసారీ ప్రాణం నష్టం జరుగుతుంది. ఓసారి గ్రామంలోకి వచ్చిన పులిని వృద్ధుడు కంట్రోల్ చేసి గ్రామస్తులకు షాక్ ఇస్తాడు. అడవి జంతువుల దాడిలో చనిపోయినవాళ్ల కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుంటుంది. అలా మరణిస్తే నష్టపరిహారం వస్తుందన్న ఆశతోనే కెంబరాజు ఓ పథకం ప్రకారం వృద్ధుడిని దత్తత తీసుకున్నాడని బాలమణికి తెలిసిపోతుంది. కెంబరాజు ప్లాన్‌ను వృద్ధుడు ఎలా తిప్పికొట్టాడు? పులిని వృద్ధుడు ఎలా కంట్రోల్ చేశాడు? కెంబన్ కోసం తాత చేసిన

త్యాగం ఏమిటి? అనేదే సినిమా కథ. లవ్‌స్టోరీకి హ్యూమన్ ఎమోషన్స్‌ను జోడిస్తూ తెరకెక్కించిన ఈ సినిమా కథ కొత్తగా ఉంది. కామెడీ, సెంటిమెంట్, ప్రేమకథ అన్ని ఎలిమెంట్స్ ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకులకు అంతగా నచ్చకపోవచ్చు. అయితే, ఈ వీకెండ్‌లో ఫ్యామిలీతో టైమ్‌పాస్ చేసేందుకు కల్వన్ సినిమా చూడవచ్చు. కల్వన్ అంటే తెలుగులో దొంగ అని అర్థం. అయితే, ఆ టైటిల్‌కు సినిమాకు సంబంధం పెద్దగా లేదనిపిస్తుంది.

దేనికైనా రెడీ..

విరూపాక్ష, పొలిమేర, పొలిమేర 2, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, రౌడీ బాయ్స్, ఓం భీమ్ బుష్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది కామాక్షి భాస్కర్ల. విభిన్నమైన క్యారెక్టర్లు చేసి మెప్పించింది. 'సైతాన్' వెబ్‌సిరీస్‌లో బోల్డ్‌గా నటించి షాక్ ఇచ్చింది. ఇటీవల ఒక యూట్యూబ్ చానెల్‌తో చిట్‌చాట్‌లో హాట్ కామెంట్స్ చేసింది కామాక్షి. 'బోల్డ్ క్యారెక్టర్లు చేయడానికి రెడీ. అమాయక పాత్ర అయినా, బోల్డ్ క్యారెక్టర్ అయినా నటికి ఒకటే! కథానుగుణంగా పాత్ర ఉంటుంది. ఆ రోల్‌ను పండించడం నటిగా నా విధి. కథ, సన్నివేశం డిమాండ్ చేస్తే.. దుస్తులు లేకుండా నటించడానికి కూడా నేను సిద్ధం. ఈ రోజు ఉండి రేపు ఫేడ్ అయిపోయే ఇమేజ్, అందం గురించి పెద్దగా పట్టించుకోను. నేను మంచి డ్యాన్సర్‌ని. పాట నచ్చి, మంచి యాక్టర్ పక్కన అయితే స్పెషల్ సాంగ్ చేయడానికి రెడీ. ఈ విషయాలన్నీ గుర్తుంచుకుని దర్శకులు ఆఫర్లు ఇవ్వాలి' అని చెప్పుకొచ్చిందీ చిన్నది.

బాలీవుడ్‌లో సక్సెస్ కోసం నాగా

'సీతారామం' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా ద్వారా టాలీవుడ్‌లో అడుగుపెట్టిన హీరోయిన్ మృణాల్ ఠాకూర్. ఈ సినిమాలో సీతగా అలరించిన మృణాల్.. 'హాయ్ నాన్న'తో మరోసారి ప్రేక్షకులకు దగ్గరైంది. విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన 'ఫ్యామిలీ స్టార్'లోనూ ఈ భామ నటనకు మంచి మార్కులే పడ్డాయి. అయితే, 'విశ్వంభర'లో మెగాస్టార్‌తో నటించే ఆఫర్‌ను తిరస్కరించిందని వార్తలు వచ్చాయి. ఆ సినిమాకు ఎక్కువ డేట్లు ఇవ్వాల్సి వస్తుందన్న కారణంగా చిరుతో స్క్రీన్ పంచుకునే అవకాశాన్ని వదులుకుందట! ప్రస్తుతానికి తన దృష్టి మొత్తం బాలీవుడ్‌పైనే ఫోకస్ చేసిందట ఈ బ్యూటీ. సంజయ్ లీలా భన్సాలీ సంగీతం అందిస్తూ నిర్మించనున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో నటించడానికి మృణాల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఇండస్ట్రీ టాక్. రవి ఉద్యావర్ దర్శకత్వం వహించనున్న ఈ ప్రేమకథా చిత్రంలో నటించడానికే టాలీవుడ్ ఆఫర్లను సున్నితంగా తిరస్కరిస్తున్నదని చెబుతున్నారు. ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో తెరకెక్కనున్న పాన్ ఇండియా సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ పేరు పరిశీలనలో ఉందని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాగా, తెలుగులో రెండు హిట్లు అందుకున్న మృణాల్‌కు హిందీలో అనుకున్న సక్సెస్ దక్కలేదనే చెప్పాలి. అందుకే బాలీవుడ్‌లో ఎలాగైనా సక్సెస్ అందుకోవాలనే పట్టుదలతో ఈ బ్యూటీ ఉందని అంటున్నారు.

టాకీస్ తుస్.. ఓటీటీ ఖుష్..

వేసవి కాలం వచ్చిందంటే థియేటర్లలో సినిమా సందడి ఓ రేంజ్‌లో ఉంటుంది. చిన్న సినిమాల నుంచి భారీ బడ్జెట్ సినిమాల వరకు బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుంటాయి. కానీ, ఈ ఎండకాలంలో టాకీసులకు వడదెబ్బ తగిలినట్టయింది. ముందుగా అనుకున్న సినిమాలకు ఎన్నికల కారణంగా వాయిదా తప్పలేదు. అయితే, థియేటర్లు బోసిపోయినా ప్రేక్షకులకు మాత్రం ఈ వేసవి కావాల్సినంత వినోదాన్నిచ్చింది. ఓటీటీలో పలు సినిమాలు, వెబ్‌సిరీస్‌లు రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నాయి. మొత్తంగా ఈ సమ్మర్‌లో అటు టాకీసుల్లో.. ఇటు ఓటీటీలో సందడి చేస్తున్న చిత్రాల సంగతులు చూద్దాం.

కల్కి

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సినిమా 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె వంటి భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ పాన్ వరల్డ్ సినిమాపై అందరికీ చాలా ఆశలు ఉన్నాయి. షూటింగ్ మొదలైనప్పటి నుంచీ ఈ చిత్రంపై రోజురోజుకూ క్రేజ్ పెరుగుతూనే ఉంది. 'కల్కి..' పోస్టర్లు సినిమాపై ఉన్న అంచనాలను మరింతగా పెంచేశాయి. ఇప్పటికే విడుదల కావాల్సిన ఈ సినిమా పలు కారణాలతో వాయిదాపడింది. అయితే, ఈ సినిమాను జూన్ 27వ తేదీన విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. దాదాపు రూ.600 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు నాగ్ అశ్విన్ దర్శకుడు.

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. అంజలి, నేహా శెట్టి హీరోయిన్లుగా చేసిన ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదాపడింది. తాజాగా ఈ నెల 31న థియేటర్లలో రిలీజ్ కానున్నట్టు మూవీ మేకర్స్ ప్రకటించారు. హిట్, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా విభిన్న కథలను ఎంపిక చేసుకుంటాడు విశ్వక్‌సేన్. కొత్త తరహా పాత్రలతో తనలోని నటుడిని మరో కోణంలో ఆవిష్కరిస్తుంటాడు. టీజర్‌ను బట్టి ఈ సినిమాలో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో అలరించడానికి సిద్ధమయ్యాడు. మొత్తంగా వేసవి చరమాంకంలో విడుదల అవుతున్న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ఎలా ఉంటుందో చూడాలి!

లవ్ మీ

'రౌడీ బాయ్స్'తో హీరోగా ఎంట్రీ ఇచ్చిన ఆశిష్, 'బేబీ' సినిమాతో యూత్‌లో క్రేజ్ సంపాదించుకున్న వైష్ణవీ చైతన్య జంటగా నటించిన సినిమా 'లవ్ మీ'. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణ సారథ్యంలో అరుణ్ భీమవరపు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమా మే 25న థియేటర్స్‌లో విడుదలైంది. దయ్యాన్ని ప్రేమలో దింపే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమా మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకుంది. కీరవాణి మ్యూజిక్ ఈ సినిమాకు ప్లస్ పాయింట్. భయపెట్టే సన్నివేశాలకు వెరవకుంటే 'లవ్ మీ'ని లవ్ చేస్తారు.

ప్రసన్నవదనం

విభిన్న చిత్రాలతో విలక్షణతను నిరూపించుకుంటున్న నటుడు సుహాస్. ఇతగాడి సినిమా వస్తుందంటే సరదాగా చూడొచ్చనే అభిప్రాయం ప్రేక్షకులకు ఏర్పడిపోయింది. విభిన్న కథను ఎంచుకొని సుహాస్ తాజాగా నటించిన 'ప్రసన్న వదనం' మే 3న ప్రేక్షకులను పలకరించింది. పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. మంచి వసూళ్లనే రాబట్టింది. కలర్ బ్లైండ్‌నెస్ ఉన్న యువకుడు ఓ హత్యను చూస్తాడు. మనుషులను గుర్తుపట్టలేని హీరో హంతకుడిని ఎలా గుర్తించాడన్నది కథ. అర్జున్ వై.కె డైరెక్ట్ చేసిన ఈ సినిమా ప్రేక్షకులకు మంచి ఫీల్ అందించింది. ఈ నెల 24

నుంచి 'ఆహా'లో 'ప్రసన్నవదనం' స్ట్రీమింగ్ మొదలైంది. అప్పటికే పాజిటివ్ టాక్ ఉండటంతో... ఇంటిల్లిపాదికీ వేసవి వినోదాన్ని పంచుతున్నది. థియేటర్లలో కన్నా ఓటీటీలో మరింత హిట్ టాక్ సొంతం చేసుకుంది.

ఆ ఒక్కటీ అడక్కు

చాలా కాలం తర్వాత అల్లరి నరేశ్ పూర్తి స్థాయి కామెడీ జానర్‌లో చేసిన సినిమా 'ఆ ఒక్కటీ అడక్కు'. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు మల్లి అంకం దర్శకత్వం వహించారు. 1992లో ఈవీవీ సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్ కాంబోలో వచ్చిన 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్‌తో తెరకెక్కిన ఈ సినిమా మే 3న విడుదలైంది. మంచి టాక్ తెచ్చుకుంది. వేసవిలో నవ్వుల జల్లు కురిపించింది. మ్యాట్రిమొనీ సైట్ల ఆగడాలను కండ్లకు కట్టింది. 'ఆహా' వేదికగా ఈ నెల 31న స్ట్రీమింగ్ కానుంది. నరేశ్ మార్కు కామెడీ కుటుంబమంతటికీ వినోదాలు పంచడం ఖాయం.

ఆరంభం

'C/O కంచరపాలెం' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరయ్యారు మోహన్ భగత్. ఆయన ప్రధాన పాత్రలో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ డ్రామా 'ఆరంభం'. 'కీడా కోలా'తో గుర్తింపు తెచ్చుకున్న రవీంద్ర విజయ్, సుప్రీత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్ ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు. అజయ్ నాగ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా మే 10వ తేదీన థియేటర్లలో విడుదలై విమర్శకుల ప్రశంసలను అందుకుంది. ప్రస్తుతం 'ఈ టీవీ విన్'లో అందుబాటులో ఉంది.

కృష్ణమ్మ

సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన యాక్షన్ డ్రామా 'కృష్ణమ్మ'. ఈ చిత్రానికి దర్శకుడు వి.వి.గోపాలకృష్ణ. మే 10న థియేటర్లలో విడుదలైంది. భారీ సినిమాలు లేకపోవడంతో 'కృష్ణమ్మ' బాక్సాఫీస్ దగ్గర ఓ మోస్తరు వసూళ్లు రాబట్టింది. అయితే విడుదలైన వారానికే ఓటీటీకి వచ్చేసింది. ఈ నెల 17 నుంచి 'కృష్ణమ్మ' అమెజాన్ ప్రైమ్‌లో అందుబాటులో ఉంది.

ఆవేశం

పుష్ప సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఫహద్ ఫాజిల్ ప్రధానపాత్రలో నటించిన కామెడీ, యాక్షన్ సినిమా ఆవేశం. జిత్తు మాధవన్ కథ, దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో దుమ్మురేపుతున్నది. మలయాళం వెర్షన్ మాత్రమే అందుబాటులో ఉన్నా తెలుగువాళ్లూ దీనిని ఎంజాయ్ చేస్తున్నారు. మే 9వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతున్నది. వేసవి వినోదం కోసం 'ఆవేశం' మంచి ఎంపిక.

రత్నం

విశాల్ కథానాయకుడిగా ప్రియ భవానీ శంకర్ హీరోయిన్‌గా తెరకెక్కిన సినిమా రత్నం. ఏప్రిల్ 26న తమిళంతోపాటు తెలుగులో థియేటర్లలో విడుదలైంది. అయితే, ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఆశించినంత వసూళ్లు సాధించలేకపోయింది. హరి గోపాలకృష్ణ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామా ఈ నెల 23న అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైంది. థియేటర్‌లో సో..సో.. అనిపించుకున్న 'రత్నం' ఓటీటీలో మాత్రం సూపర్ టాక్ తెచ్చుకుంది. యోగిబాబు, సముద్రఖని కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా యాక్షన్ ప్రియులకు మంచి వినోదాన్ని పంచుతున్నది.

ఓటీటీలో మరిన్ని

నెట్‌ఫ్లిక్స్
- టఫెస్ట్ ఫోర్సెస్ ఆన్ ది ఎర్త్ (డాక్యుమెంటరీ)– మే 22
- అట్లాస్ (హాలీవుడ్)– మే 24
- క్రూ (హిందీ)– మే 24

అమెజాన్ ప్రైమ్
- ద టెస్ట్ 3 (వెబ్ సిరీస్)– మే 23

జీ5
- వీర్ సావర్కర్ (హిందీ)– మే 24

డిస్నీ+హాట్‌స్టార్
- ద కర్దాషియన్స్ 5 (వెబ్ సిరీస్)– మే 23
- ద బీచ్ బాయ్స్ (డాక్యుమెంటరీ)– మే 24

జియో సినిమా
- ఆక్వామెన్–2 (తెలుగు)– మే 21
- డ్యూన్2 (హాలీవుడ్)– మే 21

ముద్దుతో వాళ్లకే ఇబ్బంది

మిల్కీ బ్యూటీ తమన్నా పేరు చెబితే చాలు యువతగుండె వేగం పెరుగుతుంది. గ్లామర్‌తో కుర్రకారును, డ్యాన్స్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను కట్టిపడేసే ఈ బ్యూటీ.. స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతూనే స్పెషల్ సాంగ్స్‌తో అదరగొట్టింది. నెగెటివ్ క్యారెక్టర్ చేయడానికీ వెనుకాడబోనని 'మ్యాస్ట్రో' సినిమాతో నిరూపించుకుంది. కెరీర్ ప్రారంభం నుంచీ గ్లామర్ రోల్స్ చేయడానికి ఏమాత్రం ఆలోచించని తమన్నా.. ముద్దు సీన్లకు కాస్త దూరంగానే ఉంది. అయితే, తాజాగా ఆ హద్దులను కాస్తా చెరిపేసింది. 'లస్ట్ స్టోరీస్ 2', 'జీ కర్దా' వెబ్ సిరీస్‌లలో శృంగార సన్నివేశాల్లో రెచ్చిపోయిందీ భామ. దానిపై ట్రోల్స్ కూడా విపరీతంగా వచ్చాయి. అయితే, వాటిపై తమన్నా చేసిన కామెంట్స్ మరోసారి వైరల్ అవుతున్నాయి. 'నటిగా అన్ని రకాల క్యారెక్టర్లు చేయాలి కదా! ఆ ఉద్దేశంతోనే శృంగార సన్నివేశాల్లో నటించకూడదని పెట్టుకున్న రూల్స్ బ్రేక్ చేశాను. ముద్దు సీన్లలో నటించే సమయంలో హీరోయిన్లు చాలా ఇబ్బంది పడతారు అని చాలామంది అనుకుంటారు. అయితే, అలాంటి సన్నివేశాల్లో నటించడానికి హీరోయిన్ల కంటే మగవాళ్లే ఎక్కువగా టెన్షన్ పడతారు. తోటి నటి ఇబ్బంది పడకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని భావిస్తారు. హీరోయిన్లు ఏమనుకుంటారో అనే భావనతో ఒత్తిడికి లోనవుతుంటారు. దీనివల్ల ఆ సన్నివేశంపై ఎక్కువ ఎఫెక్ట్ పడుతుంది. నటీనటులిద్దరూ ముందుగా ఒక అండర్‌స్టాండింగ్‌కు రావాలి. అప్పుడే ఏ ఇబ్బందీ లేకుండా ఆ సన్నివేశం పండుతుంద'ని కామెంట్ చేసింది.

ఇండస్ట్రీ ఎంట్రీలూ ఇచ్చేశా

కెరీర్ ప్రారంభంలో గ్లామర్ పాత్రలు చేస్తూ యువతను ఉర్రూతలూగించిన తాప్సీ పన్ను.. ప్రస్తుతం డిఫరెంట్ రోల్స్‌తో దూసుకుపోతున్నది. బాలీవుడ్ బడా స్టార్లతోనూ స్క్రీన్ షేర్ చేసుకుంటున్నది. కొన్ని నెలల కిందట షారుఖ్ ఖాన్, తాప్సీ నటించిన 'డంకీ' బాక్సాఫీస్ దగ్గర అనుకున్నంత సక్సెస్ కాలేదు. అయినా, ఆ సినిమాలో తాప్సీ నటనకు మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం 'ఓ లడ్‌కీ హై కహా', 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా', 'ఖేల్ ఖేల్ మే'.. సినిమాల్లో నటిస్తున్నది. బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న తాప్సీ.. మంచి అవకాశాలు వస్తే దక్షిణాది చిత్రాల్లోనూ నటించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆసక్తికరమైన కామెంట్స్ చేసింది. 'ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 14 ఏండ్లు దాటాయి. ప్రతి పాత్రనూ సవాలుగా తీసుకున్నాను. చాలెంజింగ్ క్యారెక్టర్లు చేయాలని కోరుకుంటున్నా. ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డాను. ఒక్కో అడుగు ముందుకు వేస్తూ ఇక్కడివరకు వచ్చాను. నా శ్రమకు తగిన ఫలితం దక్కిందని అనుకుంటున్నాను. అందుకే నేను సాధించిన దానికి సంతోషంగా ఉన్నాను' అని చెప్పుకొచ్చింది తాప్సీ.